ప్రజాశక్తి

శనివారం 10 మే 2025 | 5 | అనంతపురం





తల్లిదండ్రులతో సైనికుడు మురళీనాయక్ (ఫైల్ ఫోటో)




ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న చంద్రబాబు నాయుడు, మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, కలెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు

'అనంత' చెరువులన్నీ అనుసంధానం

- హంద్రీనీవాకు అధిక ప్రాధాన్యత
- జులై 10న హంద్రీనీవాకు నీరు విడుదల
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- ఛాయాపురం వద్ద హంద్రీనీవా పరిశీలన
- అధికారులతో సమీక్ష
- గ్రామస్తులు, సాగురైతులతో ప్రజావేదిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, ఉరవకొండ

అనంతపురం జిల్లాలోని చెరువులన్నింటినీ అనుసంధానం చేసి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం ఆయన అనంతపురం జిల్లాలో పర్యటించారు. ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలంలోని ఛాయపురం వద్ద హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశీలించారు. కాలువ వెడల్పు పనులను ఎప్పటిలోపు పూర్తి చేస్తారని అధికారులను అడిగారు. 50 రోజుల్లోపు హంద్రీనీవా కాలువ వెడల్పు పూర్తి చేస్తామని హంద్రీనీవా ఎస్ఇ తెలిపారు. ప్రస్తుతం 1500 క్యూసెక్కులు మాత్రమే నీటి ప్రవాహం కాలువ గుండా ఉండేదని, వెడల్పు పూర్తవుతే 3500 క్యూసెక్కుల వరకు నీటిని తీసుకునే అవకాశం ఉందని ఎస్ఇ ముఖ్యమంత్రికి తెలియజేశారు. అనంతరం ఛాయపురం వద్ద ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో మరణించిన మురళీ నాయక్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం జరిగిన కార్యాక్రమంలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతపురం జిల్లా అంటే ప్రత్యేకమైన అభిమానం అని చెప్పారు. ఈ జిల్లా తెలుగుదేశం పార్టీకి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కరువు జిల్లా అనంతపురం జిల్లాకు సాగునీటిని అందించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాడు ఎన్టీఆర్ హంద్రీనీవాకు రూపకల్పన చేస్తే తెలుగుదేశం పార్టీ వాటిని పూర్తి చేసే కార్యక్రమం చేపడుతోందన్నారు. 2014 నుంచి 2019 మధ్య రూ.నాలుగు వేల కోట్లకుపైగా నిధులను హంద్రీనీవా ఖర్చు పెట్టినట్టు చెప్పారు. ఇప్పుడు రూ.3500 కోట్లు వెడల్పు, కాలువ లైనింగుకు ఖర్చు పెడుతున్నామని వివరించారు. డ్రిప్ స్ప్రింక్లర్లను 90 శాతం సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. పోలవరం నుంచి బనకచెర్లకు నీటి మళ్లింపు ద్వారా కరువు ప్రాంతాలకు 300 టిఎంసిల నీళ్ల మళ్లించే ఆలోచన చేస్తున్నామన్నారు. ఇది చేయగలిగితే రాష్ట్రంలో కరువు అన్నది లేకుండా చేయవచ్చన్నారు. పి4 ద్వారా పేదరికం రూపుమాపేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రజావేదిక జరుగుతున్న ఛాయపురంలో 96 బంగారు కుంటుంబాలు ఉన్నాయన్నారు. వాటిని ఎవరైనా దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఛాయపురంలో దత్తత తీసుకోవడానికి సుజలన్, సిఫ్లాన్, ఆర్జాస్ ప్రతినిధులు ముందుకొచ్చారు.





హంద్రీనీవా పనుల పురోగతిని మ్యాప్ ద్వారా చంద్రబాబు నాయుడుకు తెలియజేస్తున్న హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు



- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఒక్క గంప మన్ను వైసిపి ప్రభుత్వం ఎత్తలేదన విమర్శించారు. 2014 నుంచి 2019 వరకు రూ.72 వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లు ఖర్చుపెట్టినట్టు చెప్పారు. ఇప్పుడు కూడా రాయలసీమ ప్రాజెక్టుల పూర్తికి అధిక ప్రాధాన్యతనిచ్చినట్టు తెలిపారు.



- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్ కలిగిన నాయకులని చెప్పారు. 30 ఏళ్ల క్రితమే డ్రిప్ సిస్టమ్ గురించి పరిశీలనకు ఇజ్రాయిల్ దేశం పంపించారన్నారు. ఇప్పుడు డ్రిప్‌లేని వ్యవసాయాన్ని అనంతపురం జిల్లాలో ఊహించగలమా అని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగులోనున్న సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులివ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, జెసి.అస్మిత్‌రెడ్డి, బండారు శ్రావణిశ్రీ, గుమ్మనూరు జయరాం, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచని అంగన్వాడీ భవనాలు

చాలా గ్రామాల్లో అద్దె భవనాలే దిక్కు..!

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల పరిధిలోని 33 గ్రామాల్లో 60 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. అయితే వాటి నిర్వహణ ను ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామ స్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 60 అంగన్వాడీ సెంటర్లు ఉండగా 11 కేంద్రాలకు మాత్రమే ప్రభుత్వ భవనాలు ఉన్నాయి. పది చోట్ల ఆర్‌డిటి పాఠశాలలో నిర్వహిస్తున్నారు. మిగిలిన భవనాలకు కనీసం స్థలం కూడా లేదు. 9చోట్ల స్థలాలు, భవనాలు ఉండి ఐదేళ్ల క్రితమే భవన నిర్మాణాలు చేపట్టినా అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఏలంజి, లింగదహాల్-1, గోవిందవాడ-1, 2, 4 కేంద్రాలకు సంబం ధించి భవన నిర్మాణాలను మధ్యలోనే ఆపేశారు. గోనెహాల్ దళితవాడ, సింగేపల్లి గ్రామంలో భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. ఇకనైనా ప్రజా ప్రతి నిధులు, అధికారులు స్పందించి అర్ధాంతరంగా ఆగిన 9 అంగన్వాడీ సెంటర్ల భవన నిర్మాణాలను పూర్తి చేసి అందు బాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే అంగన్వాడీ భవనాలు లేని గ్రామాల్లో స్థలాలు మంజూరు చేయాలని, స్థలాలు ఉండి భవనాల నిర్మాణం ఆగిపోయిన గ్రామాల్లో భవనాలను పూర్తిచేయాలని, శిథిలావస్థ చేరిన భవనాలకు మరమ్మతులు చేయడమా, నూతన భవనాలు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకో వాలని ప్రజలు కోరుతున్నారు.

జమ్మూలో జవాను 'వీర' మరణం



మురళీ నాయక్(ఫైల్ ఫోటో)



- పాకిస్తాన్ కాల్పుల్లో సత్యసాయి జిల్లా సైనికుడి మరణం
- గోరంట్ల మండలం కళ్లితండాలో విషాద ఛాయలు
- ఒక్కగానొక్క కుమారున్ని కోల్పోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు
- సైనిక కుటుంబానికి పలువురి పరామర్శ
- నేడు పార్థివదేహం స్వగ్రామానికి వచ్చే అవకాశం

నేడు స్వగ్రామానికి పార్థివదేహం

జవాను పార్థివదేహం ప్రత్యేక హెలికాప్టర్‌లో కళ్లితండాకు పంపేలా ఆర్మీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్మీ అధికారులు, కుటుంబ సభ్యుల సూచన మేరకు స్వగ్రామంలో మురళీ నాయక్ అంత్యక్రియలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రజాశక్తి-అనంతపురం గోరంట్ల, సోమందేపల్లి

భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజక వర్గం గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన జవాను మురళీనాయక్ (22) వీర మరణం పొందారు. గురువారం రాత్రి జమ్మూకశ్మీర్‌లో పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో ఈ జవాన్ మరణించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. పాకిస్తాన్ భారత సరిహద్దు ప్రాంతాలపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడుతోంది. ఈ క్రమంలో జమ్మూకశ్మీర్‌లో పాకిస్థాన్ గురువారం రాత్రి జరిపిన కాల్పుల్లో జవాన్ మురళీనాయక్ వీర మరణం పొందారు. ఈయన మృతి విషయాన్ని భారత దేశ ఆర్మీ ఉన్నతాధికారులు శ్రీ సత్యసాయి జిల్లా అధికారులు, జవాన్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. జవాన్ పార్థివదేహం శనివారం తన స్వగ్రామానికి తెచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

కుటుంబ నేపథ్యం..

శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గడ్డం తండా పంచాయతీ కళ్లితండాకు చెందిన జవాన్ మురళీనాయక్‌ది సాధారణ రైతు కుటుంబం. తండ్రి శ్రీరామ్ నాయక్, తల్లి జ్యోతిబాయి ఇద్దరూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి మురళీనాయక్ ఒక్కడే ఏకైన సంతానం. ఒక్కగానొక్క కుమారుడు సైన్యంలోకి వెళ్లి దేశానికి సేవ చేస్తానని చెప్పిగానే అడ్డు చెప్పకుండా తల్లిదండ్రులు అతన్ని సైన్యంలోకి పంపారు.

విద్యాభ్యాసం..

కళితండాకు చెందిన మురళీనాయక్ విద్యాభ్యాసం సోమందేపల్లి, అనంతపురంలో కొనసాగింది. చిన్నతనంలో సోమందేపల్లి మండలం నాగినాయని చెరువుతండాలో పెరిగాడు. సోమందేపల్లి విజ్ఞాన్ స్కూల్‌లో 1 నుంచి 10వ తరగతి వరకు చదివినాడు. ఇంటర్, డిగ్రీని అనంతపురంలో పూర్తి చేశాడు. 2019-2022లో బీకాం చదివాడు. డిగ్రీ చివరి సంవత్సరంలోనే ఆర్మీ ఉద్యోగాన్ని సంపాదించి సైన్యంలోకి వెళ్లాడు. డిగ్రీ చదివే రోజుల్లోనే చదువుతో పాటు ఎన్‌సిసి, క్రీడల్లో చురుగ్గా ఉండేవాడు.

దేశ భద్రతలో పాలు పంచుకోవాలని..

మురళీ నాయక్ ఇంటర్ చదివే రోజుల నుంచే ఆర్మీలోకి వెళ్లానే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాడు. ఆ ఉద్యోగం సంపాదించేందుకు నిరంతరం కృషి చేశాడు. అనుకున్న లక్ష్యం మేరకు డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న రోజుల్లో 29-12-2022న అగ్నివీర్ ఎంపికలో భాగంగా ఆర్మీలో ఉద్యోగం పొందాడు. ఇప్పటికి ఆయన సైన్యంలో చేరి 28 నెలలు అయ్యింది. సైన్యంలో చేరగానే నాసిక్‌లో శిక్షణ తీసుకున్నాడు. అక్కడి నుంచి అస్సాంలో ఏడాది పాటు ఉద్యోగం చేశాడు. తర్వాత పంజాబ్‌లో విధులు నిర్వహించాడు. భారత్, పాకిస్తాన్ యుద్ధం ప్రారంభం కావడంతో రెండు రోజుల క్రితం జమ్ము కాశ్మీర్ సరిహద్దుకు వెళ్లాడు. అక్కడ జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందాడు.

రెండు రోజుల క్రితం తల్లిదండ్రులకు ఫోన్

పంజాబ్‌లో విధులు నిర్వహిస్తున్న మురళీనాయక్ రెండు రోజుల క్రితం జమ్ముకాశ్మీర్ బార్డర్‌కు వచ్చాడు. జమ్ముకాశ్మీర్‌కు వచ్చిన సందర్భంగా తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. ప్రస్తుతం యుద్ధ వాతావరణం నెలకొందని, అందులో తాను పాల్గొనబోతున్నానంటూ ఎంతో ధైర్యం మురళీనాయక్ ఫోన్‌లో చెప్పాడు. దేశం కోసం యుద్ధభూమిలో పోరాడడం చాలా సంతోషంగా ఉందనేలా తల్లిదండ్రలకు గర్వంగా చెప్పాడు. రెండు రోజుల క్రితం ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి ఇలా వీరమరణం పొందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యవతం అయ్యారు.

కల్లి తండాలో విషాదం

పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో జవాన్ మురళీనాయక్ మృతి విషయం తెలియగానే ఆయన స్వగ్రామం కల్లితండాలో విషాదం నెలకొంది. సౌమ్యుడి ఉంటూ అందరితోనూ చలాకీగా మాట్లాడే యువకుడు ఇలా కాల్పుల్లో మరణించిన విషయం గ్రామస్తులను కలిచివేసింది. మురళీనాయక్ ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు చేరుకుని తల్లిదండ్రులను ఓదార్చారు. గ్రామానికి ఎప్పుడొచ్చినా అందరినీ నవ్వుతూ పలకరించే వ్యక్తి ఇలా ముష్కరులు చేసిన కాల్పుల్లో అసువులు బాసడంపై గ్రామస్తులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

పలువురి పరామర్శ

యుద్ధంలో జవాను మృతి విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు కల్లితండాకు తరలి వెళ్లారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ మృతుని తల్లిదండ్రులను కలిసి ఓదార్చారు. ప్రభుత్వం తరపును అన్ని విధాలా అండగా ఉంటామని తల్లిదండ్రులకు తెలిపారు. తక్షణం సాయంగా రూ.5 లక్షల సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. చిన్న వయసులోనే దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమైన ఘటన అని మంత్రి తెలిపారు. వీరసైనికుడు సేవలకు గుర్తింపుగా త్వరలోనే గోరంట్ల మండల కేంద్రంలో మురళీనాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు ఉషశ్రీ చరణ్, బిజెపి జిల్లా అధ్యక్షులు జి.ఎం.శేఖర్ తదితరులు జవాను కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు.

జవాన్ మృతి బాధాకరం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్



పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దాడులకు ప్రతిగా పాకిస్తాన్ జరుపుతున్న అక్రమ కాల్పుల్లో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీ నాయక్ మరణించడంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మురళీనాయక్ సైన్యంలో చేరి చిన్న వయసులో మరణించడం బాధాకరం అన్నారు. చదువుకునే రోజుల్లో ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి సామాజిక కార్యక్రమాల్లో మురళీ నాయక్ పాల్గొని సమాజం పట్ల ఎంతో నిబద్ధతతో ఉండేవాడని గుర్తు చేశారు. చిన్న వయసులో దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్ కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆయన కోరారు.

కుటుంబ సభ్యులకు చంద్రబాబు ఫోన్

పాక్ కాల్పుల్లో మరణించిన మురళీనాయక్ కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్ ద్వారా పరామర్శించారు. అనంతపురం పర్యటనకు విచ్చేసిన ఆయన అక్కడి నుంచే ఫోన్‌లో మాట్లాడి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాడు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా సాయంగా ఉంటామని భరోసా నిచ్చారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఆయన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయన్నారు.



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత



జవాను మృతికి నివాళిగా అనంతపురంలో సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన

బిటిపి పనులను పున:ప్రారంభించండి

ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే అమిలినేని



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం నియోజకవర్గ జీవనాడి అయిన బిటిపి పనులను పున్ణప్రారంభించా లని కోరుతూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సిఎం చంద్రబాబుకు విన్నవించారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పరిశీలిం చేందుకు శుక్రవారం సిఎం చంద్రబాబు ఉరవకొండ నియోజక వర్గంలోని ఛాయా పురం గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సిఎం చంద్రబాబును కలిసి పూలబొకే ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. బిటిపి పనులను త్వరలో పున్ణప్రారంభించాలని సిఎంను కోరారు.

పట్టణ అభివృద్ధికి పాటుపడండి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కౌన్సిలర్లు కళ్యాణదుర్గం పట్టణ అభివృద్ధికి పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ హాలులో శుక్రవారం కౌన్సిల్ మీటింగ్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణం అభివృద్ధిపై కౌన్సిలర్లకు పలు సూచనలు చేశారు. కౌన్సిలర్లు ముందుండి పట్టణం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లందరూ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రణాళికలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి-ఉరవకొండ

అనంతపురం జిల్లాను అన్ని రంగాల్లో మూడవ స్థానానికి వచ్చేలా ప్రణాళిక వేసుకుని పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులు, ఎమ్మెల్యేలకు సూచించారు. గురువారం సాయంత్రం వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంలో హెలిప్యాడ్ వద్ద హార్టికల్చర్, ఏపీఎంఐపి, డ్వామా, గ్రౌండ్ వాటర్, అగ్రికల్చర్, డీఆర్డీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, పిఆర్ ఎస్ఈ తదితర జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇరిగేషన్‌కు సంబంధించి డ్రోన్స్‌ను భిన్నమైన సమయాల్లో ప్రత్యేక లేయర్స్ పెట్టుకుని ఉపయోగించాలన్నారు. మాన్యువల్ కి, డ్రోన్ వినియోగించడానికి తేడా ఉందో లేదో చూసుకోవాలన్నారు. ఐటీ టీం ద్వారా వీటిని ఎలా వినియోగించాలో తెలుసుకోవాలన్నారు. సాంకేతికను ఉపయోగించి డ్రోన్స్ పెట్టి రోజువారి ఒక పని అనుకుని బ్రేకప్ చేసి పీరియాడికల్‌గా డ్రోన్స్ చెకప్ చేసుకుంటే మీకు ఒక అవగాహన వస్తుందన్నారు. కాబట్టి ఆ పని అనుకున్న సమయంలో అవుతుందా కాదా అని అంచనా వేసి దానిని బట్టి కాంట్రాక్టర్, సర్వీస్ ప్రొవైడర్‌ను ముందుకు తీసుకెళ్లేలా చేయాలన్నారు. అనుకున్న తేదీకన్నా ఒక రోజు ముందే పని పూర్తి అయ్యే విధంగా ఉండాలన్నారు. ఇక్కడ ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కలిసి సమన్వయం చేసుకుని విజన్ 2047కు సంబంధించి స్వర్ణాంధ్రప్రదేశ్‌లో భాగంగా వారు తమ నియోజకవర్గాలను ఏ విధంగా అభివృద్ధి చేసుకోవచ్చో అవగాహన వస్తుందన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఏది ఎప్పుడు చేయాలనేది చూసుకోవాలని, ఆర్థిక పరంగానే కాకుండా మాములుగా అయ్యే పనులు చాలా ఉన్నాయని, వాటన్నింటినీ పూర్తిచేస్తే మంచి పేరు వస్తుందన్నారు. పరిశ్రమ రంగాన్ని, సర్వీస్ సెక్టార్‌కు సంబంధించి అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, జల వనరుల శాఖ సెక్రటరీ సాయిప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ పాలకమండలి నియామకానికి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని దేవాదాయశాఖ అధీనంలో ఉన్న శ్రీప్రసన్న వెంకటరమణస్వామి, జంబుకేశ్వర స్వామి ఆలయ పాలకమండలి సభ్యుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని సమూహ దేవాల యాల కార్యనిర్వహణ అధికారి కె.నరసింహారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ మేరకు దేవా దాయ శాఖ కమిషనర్ ఈ నెల 6వ తేదీ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 20 రోజుల్లోగా దరఖాస్తును అనంతపురంలోని దేవాదాయ శాఖ అధికారి కార్యాలయంలో అందజేయా లని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-రాయదుర్గం

మండలంలోని 74-ఉడేగోళం వద్ద ఉన్న 132/33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకూ రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుందని ఏఈ బాలచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

అనంతపురం : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వతేదీన చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నగర కార్యదర్శి వై.వెంకటనారాయణ పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ఎస్టేట్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ హమాలీ యూనియన్ నాయకులు సాంబశివ వన్నూరుస్వామి, నాగరాజు రామాంజనేయులు భయపరెడ్డి పెద్దన్న తిప్పయ్య సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు

పేదలకు అండగా నిలుస్తున్న ఆర్డీటీ

పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ అనే సంస్థ మాత్రమే కాదని.. ఇక్కడి పేదల భావోద్వేగమని పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి అన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు రవీంద్రారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డిటికి ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. లేనిపక్షంలో కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

చంద్రబాబు బాధ్యతగా పనిచేయాలి : శైలజానాథ్

ప్రజాశక్తి-అనంతపురం

ముఖ్యమంత్రి చంద్రబాబు బాధ్యతగా పని చేయాలని మాజీ మంత్రి శైలజానాథ్ హితువు పలికారు. శుక్రవారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కక్ష సాధింపు రాజకీయాలు చేయకుండా అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. హంద్రీనీవా కాలువను రూ.10వేల క్యూసెక్కుల సామర్థ్యంతో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు వచ్చిన ఎయిమ్స్‌ను మంగళగిరికి తరలించారని, దాన్ని జిల్లాకు తీసుకురావాలని సూచించారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని సూచించారు.

వీరుడా.. నీత్యాగం మరువం

వీరజవాన్ మురళీనాయక్‌కు పలువురి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

'యుద్ధభూమిలో అమరులైన ఓ వీరుడా... నీత్యాగం భరత భూమి ఉన్నంత కాలం మరువదు' అంటూ పలువురు నివాళులర్పించారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా దేశ సరిహద్దుల్లో జరుగుతున్న కాల్పుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీనాయక్ అసువులు బాసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు కెప్టెన్ షేకన్న ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి టవర్‌క్లాక్ వరకూ ర్యాలీగా వెళ్లి తిరిగి ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ వద్ద వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పుష్పాలు అర్పించి నివాళులర్పించారు. యుద్ధంలో పాకిస్తాన్‌తో ధైర్యంగా పోరాడి వీరవనం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ట్రెజర్ తిమ్మారెడ్డి, కరణం కృష్ణ, బి.రవికుమార్, మహమ్మద్‌గౌస్, బిఎ హుస్సేన్, సుహేల్, రాజగోపాల్, వెంకటరమణ, ఎవి రమణ, శ్రీనివాసులు, బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

మురళీనాయక్ వీరమరణ త్యాగం భూమి ఉన్నతంత కాలం మరువదని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా దేశ సరిహద్దుల్లో జరుగుతున్న యుద్ధంలో ఉమ్మడి అనంతపురం జిల్లా గోరంట్ల మండలం పూడగుండ్ల తండాకు చెందిన మురళీనాయక్ అసువులు బాసిన విషయం తెలిసిందే. మురళీనాయక్ మృతి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. వీర కుమారుడిని కోల్పోయిన ఆ తల్లిదండ్రుల బాధను 130 కోట్ల మంది భారతీయులు పంచుకుంటున్నారన్నారు. మురళీనాయక్ మృతిని ఊరికే వదిలేది లేదన్నారు. పాకిస్తాన్ శత్రువులకు భారత ప్రభుత్వం ధీటైనా జవాబు చెబుతుందన్నారు. వీరజవాన్ కుటుంబానికి జనసేన పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు తెలిపారు.

అనంతపురం : రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆర్ఇఎఫ్) ఆధ్వర్యంలో వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు. ఇందులో భాగంగా నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నారాయణనాయక్, ఆర్ఇఎఫ్ జాతీయ కోఆర్డినేటర్ జి.నాగభూషణం, జిల్లా అధ్యక్షులు టి.రాజారమేష్, ఎం.ఓబులేసు, బి.రాజశేఖర్, బి.నారాయణప్ప, ఆర్.మల్లికార్జున, మెడికల్ విభాగం సాంబశివమ్మ, శ్రీరాములు, సుగుమంచి సురేష్, కె.శ్రీనివాసులు, గోవిందనాయక్, ఆర్ఇఎఫ్ రాయలసీమ కో కన్వీనర్లు నాగభూషణం, పి.ఆదినారాయణ, డి.వరదరాజులు, జి.యుగేందర్, సత్యసాయి జిల్లా ఎస్సీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.లక్ష్మీనారాయణ, ఆర్ఇఎఫ్ జిల్లా కో కన్వీనర్లు ఎన్.రాఘవేంద్రరావు, ఆర్.మహేష్‌నాయక్, భీమేష్, ఆర్అండ్‌బి నాగరాజు, వెంకటేష్‌యాదవ్, దేవకీనందన్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : భారత్ పాకిస్తాన్ యుద్ధంలో వీరజవాన్ మురళి నాయక్ మృతిచెందడం పట్ల అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రక్షణలో పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం కల్లితండాకు చెందిన మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అన్నారు. మాతభూమి కోసం ప్రాణాలు అర్పించిన మురళి త్యాగాన్ని దేశమంతా గుర్తుపెట్టుకుంటుందన్నారు. 25 ఏళ్ల వయసులోనే దేశం కోసం అమరుడైన మురళి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మురళీ నాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాం నాయక్‌లతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారన్నారు. ఆయన కుటుంబానికి మంత్రి సవిత 5లక్షల సాయం అందించారని తెలిపారు.



కళాశాలలో తోటి ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి ఉన్న వీరజవాన్ మురళీనాయక్ (పాతచిత్రం)

శ్రీవాణి విద్యాసంస్థల నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్‌కు అనంతపురం శ్రీవాణి డిగ్రీ, పీజా కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు నివాలు అర్పించారు. మురళీనాయక్ శ్రీవాణి విద్యా సంస్థల్లో డిగ్రీ చదువుకున్నాడు. ఈ సందర్భంగా కళాశాల సీఈవో పి.సుధాకర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.హెచ్.వనజమ్మ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వై.నాగరాణిలు మాట్లాడుతూ చదువుకునే రోజుల్లో ఎన్‌సిసి, క్రీడా పోటీల్లో మురళీ నాయక్ ఎంతో చలకాగా ఉండేవాడన్నారు. అలాంటి వ్యక్తి ఇలా మరణించడం బాధాకరం అని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.సుధీర్ రెడ్డి, ఎన్‌సిసి కోఆర్డినేటర్లు రామస్వామి నాయక్, నర్మదా, సి.ముత్యాలప్ప, కొండన్న, నర్సా నాయుడు, స్వర్ణలత పాల్గొన్నారు.



అహోబిలంలో స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

పెన్నహోబిలం చేరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలోని పెన్నఅహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలు శుక్రవారం సాయంత్రం పెన్నఅహోబిలం చేరాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్న సందర్భంగా సంప్రదాయ ప్రకారం ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామం నుంచి ఉత్సవ విగ్రహాలను తీసుకురావడం ఆనవాయితీ. ఇందులో భాగంగా అమిద్యాలలో వెలసిన పెన్నోబిలేసుని ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ సాకే రమేష్‌బాబు, అర్చకులు ద్వారకానాథ్, బాలాజీస్వామి, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వస్తివాచకం, రక్షాబంధనం, మత్స గ్రహణం, కలశ స్థాపన, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.

హౌసింగ్ కార్యాలయం ప్రారంభం

యాడికి : మండల కేంద్రంలోని ఎంపిడిఓ సమావేశ భవనం ఎదురుగా ఏర్పాటు చేసిన నూతన హౌసింగ్ కార్యాలయాన్ని టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ జెఇ లోకేష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజేశ్వరి, వర్క్ ఇన్స్‌పెక్టర్ మహమ్మద్ రఫీ, పట్టణ అధ్యక్షులు వెలిగండ్ల ఆదినారాయణ, ఐ టిడిపి అధ్యక్షులు నరసింహచౌదరి, బిసి అధ్యక్షులు తీరంపురం నీలకంఠ, గుండా నారాయణస్వామి, తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠారెడ్డి, హాజీ మస్తాన్, బాషా, పెద్దయ్య రహంతుల్లా, వెంకటేష్, ఖాదర్‌వలి, హౌసింగ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

యాడికి : ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ పరమేశ్వర్ డాక్టర్ కీర్తి ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సివిఆర్ డెవలప్‌మెంట్ సొసైటీ రాయల్ చెరువు దాతలు శివప్రసాద్‌రెడ్డి ఎఐజి ఆసుపత్రి హైదరాబాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త సివి రమణారెడ్డి సహకారంతో భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జుబేదా, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వడదెబ్బతో టిడిపి కార్యకర్త మృతి

యాడికి : మండల కేంద్రంలోని కమ్మ వీధికి చెందిన టిడిపి కార్యకర్త కంబగిరి రాముడు వడదెబ్బకు గురై మృతిచెందాడు. రాముడు గత మంగళవారం ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. పనులు చేస్తుంగా అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే ఉపాధి సిబ్బంది ఓ వాహనంలో యాడికి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి:సిపిఎం

గుంతకల్లు : పట్టణం ఆలూరు రోడ్డు సిఐటియు కాలనీలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగి సర్వం కోల్పోయిన వితంతు పేద మహిళ కేసరి రాణి కుటుంబానికి ప్రభుత్వ సాయం అందించి ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ కాలనీలో నివసిస్తున్న రాణి గుడిసె అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలన్నారు. పరామర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు,పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం కోసం ధర్నా

ప్రజాశక్తి-నార్పల

రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని కోరుతూ మండల పరిధిలోని నడిమిదొడ్డి గ్రామస్తులు శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 650 రేషన్ కార్డులు ఉండగా డీలర్లను నియమించకపోవడంతో విఆర్‌ఒ ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారన్నారు. వారు కూడా పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదన్నారు. 250 నుంచి 300 కార్డులకు బియ్యం పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి కార్డుదారులు అందరికీ రేషన్ పంపిణీ చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస మూర్తికి వినతిపత్రం అందజేశారు. వీరికి సిపిఐ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సాకే గంగాధర్, సీనియర్ నాయకులు నాగరాజు, సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్ద పెద్దయ్య, నారాయణప్ప, నాగిరెడ్డి, నరేందర్ రెడ్డి, నాగమణి, సురేష్, ఎర్రినాగప్ప, రమేష్, నాగిరెడ్డి, చంద్ర, లక్ష్మక్క, నాగలక్ష్మి, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబుకు పుష్పాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, పూల నాగరాజు, సంగా తేజస్విని

చంద్రబాబును కలిసిన నాయకులు

శింగనమల : జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం కలిశారు. హంద్రీనీవా సుజల స్రవంతి తొలి దశ ప్రధాన కాలువ వెడల్పు పనులను పరిశీలించేందుకు ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం ఛాయాపురానికి వచ్చిన చంద్రబాబుకు బండారు శ్రావణిశ్రీ పుష్పం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సహచర ఎమ్మెల్యేలతో కలిసి సిఎం పర్యటనలో పాల్గొన్నారు.

అలాగే ఎపిఎస్ ఆర్టీసీ కడప రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, టిడిపి రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు సంఘ తేజస్విని చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పాలు అందజేసి స్వాగతం పలికారు.

తూనికలు, కొలతలపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం



అవగాహన కల్పిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

ప్రపంచ మెట్రాలజీ దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అనంతపురంలోని డీమార్ట్ సూపర్ మార్కెట్ ప్రాంగణంలో లీగల్ మెట్రాలజీ శాఖ, అనంతపురం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ ఇన్స్‌పెక్టర్ గౌస్ తూనికలు, కొలతల్లో జరుగుతున్న మోసాలు, వాటిపై చట్టపరమైన చర్యలు, వినియోగదారులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, ఇన్స్‌పెక్టర్ ఎం.మహమ్మద్‌గౌస్, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పి. శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్ ఎం.మహమ్మద్, వినియోగదారుల సంఘ అభ్యర్థులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

ప్రజాశక్తి-గుత్తి

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి వైద్య ఖర్చులకు వైసిపి నాయకులు వి.హేమలత, గోపీనాథ్‌రెడ్డి శుక్రవారం ఆర్థికసాయం చేశారు. పెద్దవడుగూరు మండలం గుత్తివెంకటంపల్లి గ్రామానికి చెందిన జి.రాజు అనే వ్యక్తి కాశేపల్లిలో జరిగే బండిశూల తిరుణాల మహోత్సవానికి వెళ్లాడు. అక్కడ ఎద్దుల బండిపై వెళ్తుండగా ప్రమాదవశాత్తుపై పైనుంచి చక్రాల కిందకు పడి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గుత్తికి చెందిన వైసిపి నాయకులు అక్కడికి వెళ్లి వైద్య ఖర్చులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ నాగిరెడ్డి, ఆర్మీ మోహన్, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

విచ్ఛిన్న విధానాలను వీడకుంటే ఉద్యమిస్తాం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఎపిటిఎఫ్ నేతలు




ధర్నాలో మాట్లాడుతున్న వక్తలు

విద్యా వవస్థలో అనుసరిస్తున్న విచ్చిన్న విధానాలు ప్రభుత్వాలు వీడకుంటే ఉద్యమిస్తామని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర కార్యదర్శి జి.పాతిరెడ్డి హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో నేడు విద్యారంగం తీవ్ర ఒత్తిడికి గురవుతోందన్నారు. దశాబ్దాల నుంచి అమలులో ఉన్న గ్రామీణ పట్టణ ప్రాంతాలలోని ప్రాథమిక పాఠశాలల వ్యవస్థకు విఘాతం కలుగుతోందన్నారు. ఫౌండేషన్ పాఠశాలల పేరుతో ప్రాథమిక పాఠశాలల స్థానంలో ఒకటి రెండు తరగతులకు మాత్రమే పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. తొమ్మిది రకాల పాఠశాలల కోసం ప్రభుత్వం పథక రచన చేస్తుందని, ఒక్కొక్క రకమైన పాఠశాలలో ఒక్కొక్క విధంగా అశాస్త్రీయ పద్ధతిలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని పాటిస్తుందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల ఉన్నత పాఠశాలలో కూడా శాస్త్రీయ పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం మానుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వపు అధ్యక్షులు ఎన్.రఘురామిరెడ్డి, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి బి.నరసింహులు, నాయకులు దేశాయి నాగరాజు, డేనియల్, మోహన్‌రెడ్డి, రామాంజనేయులు, సతీష్ కుమార్, సుభద్ర, సర్దార్ వలి, వెంకటరమణతో పాటు 300 మంది కార్యకర్తలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.47.62 లక్షల డిఎస్‌టి సీడ్ ప్రాజెక్టు మంజూరు

జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు



ప్రాజెక్టు పత్రాన్ని చూపుతున్న విసి, సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి రూ.47.62 లక్షల డిఎస్‌టి సీడ్ ప్రాజెక్టు మంజూరైనట్లు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం తన కార్యాలయంలో జెఎన్‌టియు సిబ్బందిని అభినందించారు. ఈక సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ద్వారా దళిత రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వయం సాధనకు తోడ్పాటు కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామీణ దళితుల జీవనోపాధి మెరుగుదలకు శాస్త్రసాంకేతిక పరిష్కారాలను అందించడం ద్వారా సమాజంలో సమానత్వం, ఆత్మవిశ్వాసం పెంపొందించడమే ఈ పథకం దోహద పడుతుందన్నారు. ముఖ్యంగా జిల్లాలో వేరుశెనగ, టమోటా వంటి పంటలు సాగవుతున్నాయన్నారు. శాస్త్రీయ సాగు పద్ధతుల లోపం, మార్కెట్ లింకేజీలు లేకపోవడం, విలువ జోడింపులేని కారణంగా వల్ల రైతులకు తగిన ఆదాయం లభించకపోతోందన్నారు. ఈనేపథ్యంలో ఆయా పంటల సాగుకు సాంకేతికతను ఎలా జోడించాలన్న అంశంపై ప్రాజెక్టు బృందం పరిశోధన చేస్తుందన్నారు. ఈ ప్రాజెక్టును ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ సి.శశిధర్ పరిశోధకుడిగా, ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, బి.దిలీప్‌కుమార్, జి.మమత సహ పరిశోధకులుగా నడిపించనున్నట్లు తెలిపారు.

బాల్యవివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-నార్పల

కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని మసీదు కట్ట 1వ అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ భారతి ఆదేశాల మేరకు శుక్రవారం కిశోర బాలికలకు వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సునాలిని బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను వివరించారు. 18ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయకూడదన్నారు. చిన్న వయసులోనే గర్భం ధరించడంతో మాతా శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. కావున బాల్య వివాహాలను నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రామాంజినమ్మ, వెంకటలక్ష్మి, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : కిషోర్ వికాసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బి.కొత్తపల్లి గ్రామంలో బాల్య వివాహాలు, మత్తు పదార్థాలు, ఛైల్డ్ లేబర్, గుడాబిట్స్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, మహిళా పోలీసులు, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక కాలువ గడ్డ 1వ అంగన్వాడీ సెంటర్‌లో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ రామలక్ష్మి,



నార్పలలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, చిన్నారులు

ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు సుశీల, రజియా తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్ల తండాలో అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్ సజ్జమ్మ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సిహెచ్‌ఒ నాగరంగయ్య మాట్లాడుతూ బాల్య వివాహాల వలన అమ్మాయిల చదువుతోపాటు ఆరోగ్యం పాడవుతాయన్నారు. శారీరిక మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుందన్నారు. కావున బాల్య వివాహాలు చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శేఖర్,అంగన్వాడీ టీచర్ల పాల్గొన్నారు.

ఘనంగా వృషభాల ఊరేగింపు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలో బండిశూల తిరుణాల సందర్భంగా శుక్రవారం పెద్దవడుగూరు, చిన్నవడుగూరు గ్రామాల నుంచి సుడిబండిని లాగేందుకు వృషభాలను ఊరేగించారు. చిన్నవడుగూరు రోడ్డు నుంచి అంబేద్కర్ కూడలి వరకూ ర్యాలీ సాగింది. చిన్నవడుగూరుకు చెందిన నారాయణరెడ్డి, యువ నాయకులు దివాకరరెడ్డి, సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపులో తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకరరెడ్డి పాల్గొని ఉత్సాహపరిచారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా సిఐ రామసుబ్బయ్య, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల ఎస్ఐలు ఆంజనేయులు, నాగేంద్రప్రసాద్, పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

14న రాతిదూలం పోటీలు

పుట్లూరు : మండల పరిధిలోని మడ్డిపల్లి గ్రామంలో అంకాలమ్మ జాతర సందర్భంగా ఈనెల 14వతేదీన రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతర సందర్భంగా 12న గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, 13న ఆకుపూజ, మంగళహారతి. రాత్రికి భజన నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న రాతిదూలం పోటీలు నిర్వహించి మొదటి బహుమతి రూ.50వేలు, 2వ బహుమతి రూ.40 వేలు, 3వ బహుమతి రూ.30వేలు, 4వ బహుమతి రూ.20వేలు, 5వ బహుమతి రూ.15వేలు, 6వ బహుమతి రూ.12వేలు, 7వ బహుమతి రూ.10వేలు, 8వ బహుమతి రూ.8వేలు, 9వ బహుమతి రూ.5వేలు అందజేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సచివాలయం ప్రారంభం

ఆత్మకూరు : మండల పరిధిలోని పంపనూరులో నిర్మించిన నూతన సచివాలయాన్ని టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడిపూటి నారాయణస్వామి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, వడ్డే నాగేంద్ర, కృష్ణమోహన్ చౌదరి, శశాంక్‌చౌదరి, ఆక్కులన్న, గ్రామ కమిటీ అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, పద్మావతి, ఓబుళపతి, వెంకటేష్‌నాయక్, గోవిందనాయక్, బాలానాయక్, ప్రసాద్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ భూములు కాపాడాలని వినతి

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని రామకోటి కాలనీలో సొసైటీకి సంబంధించిన భూములను కాపాడాలని జై భీమ్‌రావు భారత్ పార్టీ అధ్యక్షులు నాగరాజు కోరారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది కొన్నేళ్లుగా సొసైటీ పేరు చెప్పుకుని వారి సొంతానికి భూములను వాడుకుంటున్నారన్నారు. కావున చర్యలు తీసుకుని సొసైటీ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు.

ఘనంగా మాతృ దినోత్సవం

అనంతపురం : సాయి ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురం ప్రపంచ మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్మయ మిషన్, అనంతపురం శాఖ సహకారంతో తపోవనంలోని చిన్మయ జగదీశ్వరాలయంలో బాబా బిడ్డల (అనాథలు)తో మాతృమూర్తులకు పాదపూజ, పంచ మాతృక వంటి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్, మాతృమూర్తులు అరుణ, కవిత, వాణి, సాయి ట్రస్టు సభ్యులు రాఘవేంద్ర, నారాయణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన

అనంతపురం : స్థానిక ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి అభినందించారు. శుక్రవారం వివిధ బహుళ జాతీయ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సి.చక్రధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతియేట తమ కళాశాల విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ఇది తమ కళాశాలకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ ఏవి ప్రసాద్, ఎఒ ఎ.శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.సాయిరాం, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

శింగనమల : ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు శుక్రవారం అన్నదానం చేశారు. ముందుగా దాదాపు 62మంది గర్భిణులకు వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ గ్రేసీ లలిత, సూపర్‌వైజర్ నాగమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ తిప్పేస్వామి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నిక

గుత్తి : ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గోపీకృష్ణ, గుత్తి యూనిట్ అధ్యక్షులు యల్లప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఉదయం నుంచి సాయంకాలం వరకూ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల నిర్వహణ అధికారిగా జిల్లా సహాధ్యక్షులు వేణుగోపాల్, సహాయ ఎన్నికల అధికారిగా జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి కెసి నాగరాజు వ్యవహరించనున్నట్లు తెలిపారు.